కలుపు కలవరం..!

- పత్తి చేలల్లో పెరిగిన గడ్డి
- పదిహేను రోజుల నుంచి వర్షంతో ఇబ్బంది
- కూలీలకు పెరిగిన డిమాండ్
- ఆందోళనలో అన్నదాత



కెరమెరిలో పత్తి చేనులో పెరిగిన గడ్డి

కెరమెరి: వారం రోజులుగా వానలు కురుస్తుండడంతో పత్తి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండడంతో పత్తి చేలల్లో గడ్డి అధికమై రైతులను కలుపు కలవరపెడుతోంది. దౌరలు కూడా పొలాల్లో నడిచే వీలు లేకుండా వ్యవసాయ క్షేత్రాలు మారాయి. పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పొలం పనులు కాస్త మందగించాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 8,210 మంది రైతులు ఉండగా.. 29,327 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. అందులో అత్యధికంగా 26,230 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు.

పెరిగిన గడ్డితో ఇబ్బందులు

ప్రస్తుతం మండలంలో ఎటూ చూసిన పత్తి పంట కనిపిస్తోంది. కానీ పత్తి చేనులో పత్తితో పాటే గడ్డి మొలకెత్తడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం ఎప్పుడు పడితే అప్పుడు వానలు కురుస్తున్నాయి. దీంతో కూలీలకు వర్షం అడ్డంకిగా మారింది. కాగా కూలీలు కూడా పత్తితో పాటు పెరిగిన గడ్డిని చూసి గుత్తా మాట్లాడుతున్నారు. ఒక ఎకరానికి రూ. 5 వేల నుంచి రూ.8 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ అయితే ఒక్క కూలీకి రోజుకు రూ. 300 నుంచి రూ.400 వరకు అడుగుతున్నారు. దీంతో ఏం చేయాలో తోచక కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. మందు పిచికారీతో పంటకు కొంత నష్టం కలుగుతుందని భావించి మరికొందరు ఖర్చుకు వెనకాడకుండా కూలీలతో కలుపు తీయిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట ఎదుగుతున్న దృష్ట్యా ప్రారంభంలోనే రూ. వేలల్లో పత్తి పంటకు ఖర్చు పెడితే రానున్న రోజులు ఇంకెంత భారమవుతాయోనని రైతులు మదనపడుతున్నారు.

డిమాండ్ పెరిగింది..



ప్రస్తుతం కురుస్తున్న వానలకు పత్తి చేలల్లో బాగా గడ్డి పెరిగింది. దీంతో కూలీలు అధికంగా డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ రూ.300 నుంచి రూ.400 వరకు ఇవ్వాల్సి రావడంతో కష్టాలు తప్పడం లేదు. గుత్తాగా మాట్లాడితే రూ.వేలల్లో ఖర్చవుతోంది.

– ఆత్రం భీంరావు, పట్నాపూర్

తిర్యాణి సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్సీ దండె విఠల్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

తిర్యాణి: మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో రూ.3.25 కోట్ల నిధులతో మంజూరైనా బాలుర వసతి గృహనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో నెలకొన్న నీటి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. అంతకుముందు మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు జిల్లా కలెక్టర్ ద్వారా రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించి రోడ్ల మరమ్మతులకు కేటాయించామన్నరు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, నాయకుడు అనిల్ గౌడ్, మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, యువజన అధ్యక్షుడు పున్నం హరీశ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్: ఎస్సీ వసతిగృహంలో పని చేస్తున్న వర్కర్ల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సజీవన్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం మాట్లాడుతూ ఎస్సీ వసతి గృహంలో పని చేస్తున్న వర్కర్లకు 7 నెలల నుంచి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిధులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు సకాలంలో చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న బిల్ సె క్షన్ ఉద్యోగి అశోక్‌పై చర్యలు తీసుకోవాలని కోరా రు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, సత్యశ్రీ, రేవతి, శారద, కవిత, రాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి ఓసీపీ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేసి భూపాలపల్లి ఏరియా క్వాలిటీ డిపార్టుమెంట్‌కు బదిలీపై వెళ్తున్న డీవైజీఎం కృష్ణ ప్రసాద్‌ను మంగళవారం ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డితో పాటు విభాగాల అధిపతులు కృష్ణ ప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. పీవో నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులు విధులకు గైర్హాజరు కావొద్దు'

రెబ్బెన: కార్మికులు విధులకు గైర్హాజరు అవుతూ, ఉద్యోగం కోల్పోయి కుటుంబాన్ని రోడ్డు పాలు చేయొద్దని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి కారణాలు తెలుసుకున్నారు. జీఎం మాట్లాడుతూ ఏరియాలో భూగర్భ గనులు లేవని, ఓసీపీలో ఉపరితల పనులే కొనసాగుతున్నాయని తెలిపారు. అయినా ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో దాని ప్రభావం ఉద్యోగుల కుటుంబంతో పాటు సంస్థపై పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎ స్వోటూజీఎం రాజమల్లు, డీవైపీఎం ఎస్వీ రాజేశ్వర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి రజినికుమార్ పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచాలి

కౌటాల: పశువుల ఆరోగ్యంపై పశు పోషకులు ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని మండల పశువైద్యాధికారి ఎన్. శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి, ముత్తంపేట్ గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని తెలిపారు. రైతులు పశు సంపదను పెంచాలన్నారు. పశువులకు వ్యాధులు సోకితే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ముత్తంపేట పశువైద్యాధికారి అంజలి, సిబ్బంది బిక్షపతి, శోభన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ స్థాయి విద్య అందించాలి'

జైనూర్: పీవీటీజీలకు గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనకు ప్రభుత్వాలు చొరవ తీసుకుంటున్నాయని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ రావు, ఎంఈవో మధుకర్‌లు అన్నారు. డీఏజేజీయూఎస్ పథకం కింద జైనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన రూ. 2కోట్ల 70 లక్షల నిధులతో వసతి గృహ భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు.

హాస్టల్ నిర్మాణానికి భూమిపూజ

లింగాపూర్: మండల కేంద్రంలో రూ.2 కోట్ల 70 లక్షలతో నూతనంగా నిర్మించనున్న బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి మంగళవారం అధికారులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఏఈ ప్రవీణ్, శశికిరణ్ తదితరులు ఉన్నారు.

'మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు'

దహెగాం: రైతులు పంట చేలల్లో మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ఒడ్డుగూడ, కొంచవెల్లి, దహెగాం, చంద్రపెల్లి గ్రామాల్లో పర్యటించారు. రైతులకు ఎరువుల వినియోగంపై సలహాలు, సూచనలు అందజేశారు. అధిక మోతాదులో ఎరువులు వాడితే భూసారం దెబ్బతింటుందన్నారు. సూచించిన మేరకే వినియోగించాలని పేర్కొన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

ఆసిఫాబాద్‌రూరల్: మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ అన్నారు. మంగళవారం వనమహోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ యాదగిరితో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి చెట్లు మాత్రమే ఉపయోపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు ఝాన్సీరాణి, సెక్షన్ అధికారి మహేందర్, సతీశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



కెరమెరి: మండల కేంద్రంలో..



బెజ్జూర్: పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: గ్రామీణ ప్రాంతాల్లో నాగుల పంచమికి అత్యంత ప్రాధాన్యత ఉంది. నాగు పాములకు ప్రత్యేక పండుగగా భావించే నాగుల పంచమిని మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శివాలయానికి వెళ్లి పూజలు చేసి శివునికి అభిషేకం నిర్వహిచారు. మహిళలు సమీప పాముల పుట్టల్లో పాలుపోసి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. పాలతో పాటు నవధాన్యాలు, పుట్నాలు తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. శ్రావణ శుద్ధ చతుర్దశి సందర్భంగా స్త్రీలు ఉపవాసాలు చేపట్టారు. ఆచార వ్యవహారాలతో జాజి, సంపెంగ, పుష్పాలతో పూజించారు. కలివిడి, పప్పు, వడ, నువ్వులతో చేసిన ఉండలు, క్షీరాన్నం సమర్పించారు. అనేక ప్రాంతాలలో చిన్నా ,పెద్దా తేడాలేకుండా ఉయ్యాలలూగారు. బతుకమ్మ ఆడారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నాగుల పంచమి ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయాలకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. శివుడికి, నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం మహిళలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు దేవాలయాలకు వెళ్లి నాగుల పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కుసుమహరనాథ దేవాలయం, శ్రీ వేంకటేశ్వర దేవాలయం, ఓల్డ్ కాలనీలోని గణేశ్‌మందిర్‌లలోని పుట్టల్లో మహిళలు పాలు పోసి పూజలు చేశారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా



కాగజ్‌నగర్‌టౌన్: కుసుమహరనాథ ఆలయంలో..

గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి పుట్టల్లో పాలు పోశారు.

కౌటాల: మండలంలోని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలను నిర్వహించారు. కౌటాల శివాలయం, గురుడుపేట శివాలయాలతో పాటు గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

సిర్పూర్(టి): నాగుల పంచమి పురస్కరించుకుని మండలంలోని భక్తులు పాముల పుట్ట వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని శివాలయంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ, నైవేద్యాలు సమర్పించారు.

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం భక్తులు నాగుల పంచమి వేడుకలు నిర్వహించారు.



పెంచికల్‌పేట్: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కౌటాల: వీర్దండిలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పులుల దినోత్సవం

బెజ్జూర్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెజ్జూర్ జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జూర్ ఎఫ్ఆర్‌వో ముసవిర్ పులుల ప్రాముఖ్యత, సంరక్షణపై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పులుల రక్షణ, అడవుల పరిరక్షణ, పులుల జీవవైవిధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు. డిప్యూటీ ఆర్‌వో శ్రావణ్, అటవీశాఖ అధికారులు, ఎంఈవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనూర్: అడవులను రక్షించడంతో పాటు అడవి జంతువులను రక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అటవీశాఖ అధికారులు పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురుకుల పాఠశాల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీఐ రమేశ్, అటవీ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

తిర్యాణి: పులుల రక్షణ ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఫారెస్ట్ రేంజ్ అధికారి



సిర్పూర్(టి): ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఫారెస్టు కార్యాలయం నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు పులుల సంరక్షణపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఇక్బాల్, సెక్షన్ ఆఫీసర్లు భీమ్లా నాయక్, భీంరావు, ఉజ్వల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: అంతరించి పోతున్న పులిజాతిని కాపాడుకోవడంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రెబ్బెన ఫారెస్ట్ ఇన్‌చార్జి రేంజ్ అధికారి భానేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు పులి విశిష్టత వివరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎఫ్ఎస్‌వో రవి, బాబు, బీట్ అధికారి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: అడవుల రక్షణపై అందరికీ అవగాహన ఉండాలని ఖర్జెల్లి రేంజ్ ఎఫ్ఆర్‌వో ఎ.సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటవీ సంరక్షణ వన్యప్రాణుల సంరక్షణ అనే అంశాలపై వ్యాసరచన, చిత్రకళా పోటీలు నిర్వహించారు. డిప్యూటీ రేంజర్ హైమావతి, సంతోష్ కుమార్, ఏఎస్సై రాథోడ్ మాను, ఎఫ్‌బీవో ప్రభాకర్, శుక్రు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి పాత్ర కీలకమని సిర్పూర్(టి) అటవీశాఖ ఇన్‌చార్జి రేంజ్ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి బస్టాండ్ ప్రాంతం వరకు విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం, మానవహారం నిర్వహించారు. డీఆర్‌వో శ్రీధర్‌బాబు, సెక్షన్ అధికారులు తులీదా, తిరుపతి, అత్తారుద్దీన్, ప్రసాద్‌రావ్, మోతిలాల్, వందన, బీట్ అధికారులు, వాచర్లు పాల్గొన్నారు.



తిర్యాణి: మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు



చింతలమానెపల్లిలో..



రెబ్బెన: బహుమతులు అందజేస్తున్న బానేశ్


ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు నదీ సమీపాన గల శ్రీ పంచముఖ నాగ సుబ్రమణ్య స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ మొదట గణపతిపూజ, ధ్వజారోహణ, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, ఫల పుష్పాలంకరణ, మంగళహారతి, మహా మంత్రపుష్పం, మహాశీర్వాదం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివే క్, మధు, రూప్‌నార్ రమేశ్, యాదగిరి, చిలుకూరి రమేశ్, బాబుగౌడ్, సుధాకర్, గణపతి, భక్తులు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

కావడి యాత్ర

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని హనుమాన్ మందిర్ నుంచి మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం వరకు మంగళవారం భక్తులు కావడియాత్ర చేపట్టారు. శ్రావణమాసంలో ఏటా వివిధ పుణ్య నదుల నుంచి తీసుకొచ్చిన గంగాజలంతో యాత్ర నిర్వహించి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మార్వాడీ మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?





కెరమెరి మండలంలోని దనోరా గ్రామం ప్రాథమిక పాఠశాల(తె/మీ)లోని మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. గోడలు పగుళ్లు తేలడంతో ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 50 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదు. గడిచిన కొన్ని నెలలుగా గోడలు పగిలిపోయి ఉన్నప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..? అంటూ మండిపడుతున్నారు.

– కెరమెరి

భోజనంలో తాజా కూరగాయలు వాడాలి



వాంకిడి: వంటలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

వాంకిడి: వసతిగృహ విద్యార్థులకు అందించే భోజనంలో తాజా కూరగాయలు వాడాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వసతి, తరగతి గదులు పరిశీలించారు. సరుకులు, స్టాక్ వివరాలు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని, పాఠశాల ఆవరణలో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్న, వార్డెన్ రాంచందర్, తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకుశాపూర్, మారేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట రాజయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పంచశీలనగర్, నజ్రుల్‌నగర్ 1, నజ్రుల్‌నగర్ 3 ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. నజ్రుల్‌నగర్ 3 పాఠశాలల్లో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ ప్రమోద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం నారాయణ్ సింగ్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ధనూరి ప్రశాంత్ అండర్ 16 లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, ధనూరి అజయ్ అండర్ 14 లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ హరికృష్ణ పాల్గొన్నారు.